క్లుప్తంగా

శ్రీనూకాలమ్మకు బంగారు పుస్తెలతాడు సమర్పణ



అమ్మవారికి బంగారు పుస్తెలతాడును అందజేస్తున్న చంద్రరావు, సుజాత

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీనూకాలమ్మ అమ్మవారికి వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, సుజాత దంపతులు సోమవారం రూ.1.60 లక్షల విలువైన బంగారు పుస్తెల తాడును సమర్పించారు. తొలుత వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణకు పుస్తెల తాడును అందజేశారు.

టి.నరసాపురం ఎస్సైగా సురేంద్రకుమార్



టి.నరసాపురం: టి.నరసాపురం ఎస్సైగా బి.సురేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెనుమంట్ర మండలం నుంచి బదిలీపై టి.నరసాపురం వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును అప్పలరాజుగూడెం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కె.సతీష్‌కుమార్ గోపాలపురం బదిలీపై వెళ్లారు.

జంగారెడ్డిగూడెం ఎంపీడీవోగా ప్రసాద్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం ఎంపీడీవోగా కేవీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

ద్వారకాతిరుమల ఎంపీడీవోగా తిరుపతిరావు

ద్వారకాతిరుమల: రఘుపాత్రుని తిరుపతిరావు ద్వారకాతిరుమల ఎంపీడీవోగా సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తించిన ఆయన పదోన్నతి పొంది, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన ఏవీ సుబ్బరాయన్ ఈవోపీఆర్డీగా కొనసాగనున్నారు.

సచివాలయ ఉద్యోగి మృతి

కామవరపుకోట: తడికలపూడి గ్రామ సచివాలయం–2లో గ్రేడు–3 సర్వేయర్‌గా పనిచేస్తున్న, దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన గోపర్తి వెంకటేశ్వరరావు (25) అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వెంకటేశ్వరరావు అవివాహితుడు. జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ కొత్తపల్లి రజిని శ్రీనివాస్, ఎంపీటీసీ గంగుల కడియాలు తదితరులు కొవ్వలి వెళ్లి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు

కొయ్యలగూడెం: అచ్యుతాపురంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం సోమవారం డాక్టర్ ఎస్తేరు రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి హెచ్‌బీ శాతం తక్కువగా ఉన్నవారికి ఐరన్ గ్లుకోజ్ ఇవ్వాలని ఏఎన్ఎంకు సూచించారు. బీపీ, షుగర్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం ఎంపీయూపీ పాఠశాలను, అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

పోలవరం రూరల్: మెనూ ప్రకారం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ఆయన పరిశీలించారు.

10 మంది జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: గుణ్ణంపల్లిలో ఒక పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అరెస్టు చేసి, రూ.17,800, 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

గోడపత్రిక ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఫాసిస్టు ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, వ్యాపారీకరణతో కూడిన నూతన జాతీయ విద్యా విధానాన్ని(ఎన్ఈపీ 2020) రాష్ట్రంలో అమలు చేయవద్దని వినోద్ డిమాండ్ చేశారు.

నాయక్‌లకు ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి

జంగారెడ్డిగూడెం: నాయక్ కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి, ఆర్డీవో ఝాన్సీరాణికి వినతిపత్రం అందజేశారు. ఫ్రాన్సిస్ మాట్లాడుతూ కామవరపుకోట మండలంలో నాయక్ కులానికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధికి చిరునామా సీఎం జగన్

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- అప్పలరాజుగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం



అప్పలరాజుగూడెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: ప్రతిపక్ష నేత చంద్రబాబు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధికి చిరునామాగా నిలిచారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని అప్పలరాజుగూడెంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ ఫలాలను అందించారన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి వాటి రూపురేఖలే మార్చివేశారని, గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టులను సైతం ఆశ్రయించిన నీచ చరిత్ర కలిగిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ శ్రీను రాజు, ఎంపీటీసీ కర్రి రామభాస్కరరెడ్డి, బండి సుబ్బారావు, సర్పంచ్ జల్లా మూర్తి, నాయకులు బోళ్ల రంగారావు, భూక్యా వేణు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంపై లోకేశ్ ఆరోపణలు సిగ్గుచేటు

జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సూర్యనారాయణరాజు

టి.నరసాపురం: ఎంతో చక్కగా నడుస్తున్న టి.నరసాపురం సహకార సంఘంపై యువగళంలో నారా లోకేశ్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అని టి.నరసాపురం జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. యువగళం పేరుతో టి.నరసాపురం మండలంలో పర్యటించిన నారా లోకేశ్ చేసిన ఆరోపణలపై జెడ్పీటీసీ సామంతపూడి స్పందించి అప్పలరాజుగూడెంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టి.నరసాపురం సహకార సంఘంలో డిపాజిట్లు ఎంత, రుణాలు ఎన్ని ఇచ్చారు, సొసైటీకి ఆస్తులు ఎన్ని ఉన్నాయి అనే కనీస అవగాహన లేకుండా ప్రజలను రెచ్చగొట్టే విధంగా రూ.125 కోట్లు అవినీతి జరిగిందని మాట్లాడటం లోకేశ్ అవగాహనా రాహిత్యానికి నిదర్శనం అని అన్నారు. రూ.22 కోట్లు డిపాజిట్లు సహకార సంఘంలో భద్రంగా ఉన్నాయని, రూ.70 కోట్ల రుణాలు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. సొసైటీ స్థాయే రూ.125 కోట్లు కాదన్నారు. ఆరోపణలు చేసేటప్పుడు ఆలోచించి మాట్లాడాలన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధి కోసం లేనిపోని ఆరోపణలు చేస్తే ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. రూ.125 కోట్ల అవినీతిని చూపిస్తే దేనికైనా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈసారి ఎన్నికల్లో గతంలో వచ్చిన 23 ఎమ్మెల్యేలు కూడా రావని భయంతో మాలో మాకు గొడవలు పెట్టేలా లోకేశ్ వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన అవినీతి ప్రతిఒక్కరికి తెలుసు అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలు వైఎస్సార్ సీపీ సాధిస్తుందని జెడ్పీటీసీ ధీమా వ్యక్తం చేశారు. సహకార సంఘంపై చేసిన ఆరోపణలపై తాము చర్చకు సిద్ధమన్నారు. సహకార సంఘంపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వమే అధికారులను నియమించిందని, విచారణ జరుగుతుందని, ఆ మాత్రం కూడా తెలియకుండా విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో సూర్యనారాయణరాజుతో పాటు పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీవెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బండి సుబ్బారావు, సర్పంచ్ జల్లా మూర్తి తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



విజయవాడలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరేష్



హైదరాబాద్‌లో పింఛన్ అందిస్తున్న వలంటీర్ బాబు

కుక్కునూరు: కుక్కునూరు మండలం వింజరం పంచాయతీ కొండపల్లి గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారు తోట పద్మావతి హైదరాబాద్‌లో కంటి ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో వలంటీర్ గుగులోత్ బాబు హైదరాబాద్ వెళ్లి ఆమెకు పింఛన్ అందించాడు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలు వలంటీర్‌ను అభినందించారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన ఎరుబోయిన కొవ్వాడమ్మకి వలంటీర్ యర్రంశెట్టి నరేష్ విజయవాడ వెళ్లి సోమవారం వృద్ధాప్య పెన్షన్ అందజేశాడు. కొన్ని రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో కొవ్వాడమ్మ విజయవాడలో చికిత్స పొందుతోంది. దీంతో నరేష్ అక్కడకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేశాడు.

స్పందనలో 16 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 16 అర్జీలు అందినట్లు ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు అధికారులు శ్రద్ధతో పరిష్కార మార్గాలు చూపించాలని అన్నారు.

జీలుగుమిల్లి ఉపసర్పంచ్‌గా దుర్గమ్మ ఎన్నిక

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా బీసీ మహిళ కుసుమ దుర్గమ్మ ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ 10వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన ఆమెకు ఉప సర్పంచ్ ఎన్నికలో 10 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపారు. ఆమె ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

జి.కొత్తపల్లిలో 'పాలవెల్లువ'

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లిలో జగనన్న పాలవెల్లువ, రుణమేళాను సోమవారం నిర్వహించారు. ద్వారకాతిరుమల డీసీసీబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ రమేష్ మాట్లాడుతూ ఆవుకి రూ.75 వేలు, గేదెకు రూ.90 వేలు రుణం ఇస్తారన్నారు. రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం అందించాలన్నారు. గేదె పాలను అమూల్‌కు మాత్రమే పోయాలని సూచించారు.

జాతీయ సదస్సు విజయవంతం చేయాలి

పోలవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 2023 అటవీ సంరక్షణ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నంలో సెప్టెంబర్ 12, 13 తేదీలల్లో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయసదస్సు విజయవంతం చేయాలని ఆయా సంఘాల సభ్యులు కోరారు. వెంకటరెడ్డిగూడెంలో ఏజెన్సీ గిరిజన సంఘం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కుంజం రామారావు సోమవారం జాతీయసదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆచార్య మాతాజీలకు శిక్షణ

ద్వారకాతిరుమల: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయాల వద్ద నిర్వహించే, బాలవికాస కేంద్రాల ఆచార్య మాతాజీలకు రెండు రోజుల శిక్షణా తరగతులను శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండపంలో సోమవారం ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమరసత ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు మాట్లాడుతూ నిరంతరం నేర్చుకుంటూ, ఇతరులకు నేర్పగలిగేవారే గురువులని అన్నారు. ఆ స్థానంలో మీరుంటూ విద్యార్థులకు క్రమశిక్షణ, దైవభక్తి, దేశభక్తి, మన సంస్కృతి సంప్రదాయాలను నేర్పుతూ సృజనాత్మక శక్తిని వెలికి తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో 175 మంది మాతాజీలు పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

జంగారెడ్డిగూడెం: నిత్యావసర ధరలు తగ్గించాలని, ప్రైవేటీకరణ మానుకోవాలని తదితర సమస్యల పరిష్కారం కోరుతూ జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, పట్టణ కన్వీనర్ పి.సూర్యరావు, పార్టీ మండల నాయకులు అందుగుల ప్రభాకర్‌రావు పాల్గొని మాట్లాడారు.